సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం । 16 । జూన్‌ । 2023



కోచ్‌ల కొరత తీరేనా..?

ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాలో క్రీడారంగాన్ని కోచ్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

వివరాలు 8లో ▸



‘ఇరిగేషన్‌’లో సంపద వనాలు

సంపద వనాల పేరుతో ఇరిగేషన్‌ స్థలాల్లో భారీగా మొక్కలు నాటనున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.9 /24.1

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

పోడు పట్టాలకు కసరత్తు

24 నుంచి పట్టాల పంపిణీ చేసేందుకు సన్నద్ధం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 18,845 దరఖాస్తులు
- నాగర్‌కర్నూల్‌ జిల్లాలో అత్యధికంగా 11,828 దరఖాస్తులు
- దశాబ్ది సంబరాలతో ప్రక్రియ నత్తనడకన సాగుతున్న వైనం



అమ్రాబాద్‌ మండలం మాధవానిపల్లి శివారులోని తాటిచెల్క అటవీప్రాంతంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడుభూములు

సాక్షి, నాగర్‌కర్నూల్‌: పోడు భూములు సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈనెల 24 నుంచి రైతులకు పోడు పట్టాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేస్తోంది. ప్రతి ఏటా వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో రైతులకు, అధికారులకు మధ్య వివాదం చెలరేగుతోంది. విత్తనాలను నాటేందుకు రైతులు వ్యవసాయక్షేత్రాల్లోకి వెళ్లడం, అటవీ భూముల్లో సాగు చేస్తున్నారంటూ అటవీ అధికారులు అడ్డుకోవడం పరిపాటిగా మారుతోంది. ఈ క్రమంలోనే ఇరువర్గాల మధ్య వివాదం ముదిరి ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సారి వానాకాలం సాగుకు ముందే ప్రభుత్వం పోడు పట్టాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటుండటంపై పోడు రైతుల్లో ఆశలు నెలకొన్నాయి.

ఆర్‌ఓఎఫ్‌ఆర్‌ చట్టమే కీలకం..

పోడు భూముల సాగు విషయంలో అర్హులను తేల్చేందుకు అటవీ హక్కు చట్టం 2006 కీలకంగా మారింది. ఈ చట్టం ప్రకారం గిరిజనులు అయితే 2005 సంవత్సరానికి ముందు పోడుసాగులో ఉన్నవారు అర్హులుగా ప్రభుత్వం గుర్తించగా, ఇందుకు సంబంధించిన ఆధారాలను చూపించాల్సి ఉంటుంది. గిరిజనేతరులు అయితే సుమారు 75ఏళ్లకు ముందే తమ పూర్వీకులు పోడు సాగులో ఉన్నట్టు నిరూపించుకోవాల్సి ఉంటుంది. పోడు భూముల సమస్య పరిష్కారం కోసం గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా నాగర్‌కర్నూల్‌ జిల్లాలో మొత్తం 11,828 దరఖాస్తులు రాగా, మహబూబ్‌నగర్‌లో 3,550, వనపర్తిలో 3,229, నారాయణపేటలో 229, జోగుళాంబ గద్వాల జిల్లాలో అత్యల్పంగా 9 దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. వీటి పరిష్కారానికి గ్రామస్థాయిలో గ్రామసభలను నిర్వహించి జాబితాను రూపొందించారు. గ్రామస్థాయి నుంచి వచ్చిన దరఖాస్తులను డివిజన్‌ స్థాయి కమిటీ, తర్వాత జిల్లాస్థాయి కమిటీ విచారణ జరిపి తుది జాబితాను రూపొందిస్తోంది.

సమస్యాత్మక ప్రాంతాలివే..

నాగర్‌కర్నూల్‌ జిల్లాలో అటవీ భూముల విషయంలో ఏటా రైతులకు, అధికారులకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ప్రధానంగా అమ్రాబాద్‌, పదర, కొల్లాపూర్‌, పెద్దకొత్తపల్లి మండలాల్లో అధికంగా పోడు భూములు ఉన్నాయి. అమ్రాబాద్‌ మండలంలోని మాదవానిపల్లి, తాటిచెల్క, మాచారం గ్రామాలు, పదర మండలంలోని చిట్లంకుంట, ఇప్పలపల్లి, కొల్లాపూర్‌ మండలంలోని ముక్కిడిగుండం, మొలచింతలపల్లి, కుడికిళ్ల, నార్లాపూర్‌, గేమ్యానాయక్‌తండా, రామాపురం, రామగిరి గ్రామాలు, పెద్దకొత్తపల్లి మండలంలోని చెన్నపురావుపల్లిలో అధికంగా పోడుభూములు సాగులో ఉన్నాయి. పదర మండలం ఇప్పలపల్లి శివారులో అధికారులు, రైతులకు మధ్య తరచుగా వివాదం కొనసాగుతోంది. ఇప్పలపల్లి శివారులోని తీగమాన్‌పెంటకు చెందిన 38 ఎకరాలకు సంబంధించి రైతులకు పట్టాపాస్‌ బుక్కులు ఉండి, రైతుబంధు వస్తున్నా అటవీ అధికారులు మాత్రం సదరు భూములు అటవీ శాఖ భూములుగా పేర్కొంటున్నారని రైతులు వాపోతున్నారు.



పదర మండలం తీగమాన్‌పెంట ప్రాంతంలో భూములను సర్వే చేస్తున్న అటవీ అధికారులు

దశాబ్ది సంబరాల్లో బిజీగా అధికారులు

జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఈనెల 24 నుంచే పోడు రైతులకు పట్టాలను అందజేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు సగం కూడా పరిష్కారానికి నోచుకోలేదు. పట్టాల పంపిణీలో అటవీ శాఖ, రెవెన్యూ, పంచాయతీ, గిరిజన సంక్షేమ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉండగా, వీరంతా ఈ నెల 22 వరకు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో నిమగ్నమయ్యారు. దీంతో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మందగించింది. ఉన్నతాధికారులు స్పందించి గడువులోగా అర్హులైన రైతులందరికీ పోడు పట్టాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

పట్టాలు త్వరగా అందించాలి..



ముక్కిడిగుండం సమీపంలోని జీల్‌దార్‌ తిప్ప సమీపంలో 30 ఏళ్ల నుంచి మూడు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. సర్వే నంబర్‌ 157లో ఏళ్లుగా సాగులో ఉన్నా ఇప్పటివరకు మాకు పట్టాలు ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి త్వరగా పోడు పట్టాలు అందజేయాలి.

– సబావత్‌ రాములు నాయక్‌, ముక్కిడిగుండం, కొల్లాపూర్‌

అర్హులైన వారందరికీ అందజేస్తాం..



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అర్హులైన పోడు రైతులందరికీ పట్టాలను అందజేస్తాం. జిల్లావ్యాప్తంగా మొత్తం 11,828 దరఖాస్తులు అందాయి. వీటిని క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. తొలివిడతలో 2 వేల మందికి పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. తప్పకుండా జిల్లాలో అర్హులైన అందరికీ పట్టాలు పంపిణీచేస్తాం.

– ఉదయ్‌కుమార్‌, కలెక్టర్‌

ఉమ్మడి జిల్లాలో పోడు దరఖాస్తుల వివరాలు

జిల్లా	నాగర్‌కర్నూల్‌	మహబూబ్‌నగర్‌	వనపర్తి	నారాయణపేట	జోగుళాంబ గద్వాల
దరఖాస్తులు	11,828	3,550	3,229	229	9
సిద్ధమైన పట్టాలు	1,950	26	311	6	0

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంకావాలి



మాట్లాడుతున్న కలెక్టర్‌ ఉదయ్‌కుమార్‌

నాగర్‌కర్నూల్‌: రాష్ట్రంలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్‌ ఉదయ్‌కుమార్‌ అన్నారు. గురువారం సాయంత్రం సమీకృత నూతన కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, ఆర్డీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధపై కేంద్ర ఎన్నికల కమిషన్‌ ఈ నెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తుందని, ఇందుకోసం జిల్లాలోని కొల్లాపూర్‌, అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌ నియోజకవర్గాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. అక్టోబర్‌ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని, ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులపై నివేదిక తయారు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణపై 42 అంశాలపై అధికారులు సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు. బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితా సమగ్ర వివరాలను నమోదు, తొలగింపు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించన్నారు. అలాగే ప్రతి పోలింగ్‌ కేంద్రాన్ని సందర్శించి ర్యాంపులు ఇతర ఏర్పాట్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ మోతీలాల్‌, ఆర్డీఓలు హనుమానాయక్‌, పాండునాయక్‌, తహసీల్దార్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

జంతువులపై కరుణ చూపాలి..

జంతు సంరక్షణ చట్టాలను పక్కాగా అమలు చేసి, జంతు సంక్షేమానికి అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ అన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంరక్షణ– సామాజిక బాధ్యతపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జంతువులపై దయ, కరుణ ఉండేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని, ఇందుకోసం పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. జంతువులను వాహనాల్లో రవాణా చేసేటప్పుడు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆవులు, దూడలు, గేదెలను వధించడం నిషేధం అని, పశువులు అక్రమ రవాణాపై పోలీస్‌, రవాణా శాఖల అధికారులు జిల్లాలోని కొత్త్ర, హాజీపూర్‌, తిమ్మాజిపేట ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీఎఫ్‌ఓ రోహిత్‌ గోపిడి, పశుసంవర్ధక శాఖాధికారి రమేష్‌, జిల్లా రవాణా శాఖాధికారి ఎర్రిస్వామి, డీఈఓ గోవిందరాజులు, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, మార్కెటింగ్‌ అధికారి బాలమణి, మున్సిపల్‌ కమిషనర్‌ జయంత్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ మోహన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి సంధ్యారాణి

కోయిల్‌కొండ: వ్యవసాయ చట్టాలపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని సీనియర్‌ సివిల్‌ జడ్జి సంధ్యారాణి అన్నారు. గురువారం ఇన్‌చార్జ్‌ జిల్లా జడ్జి బోయశ్రీనివాసులు ఆదేశానుసారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్‌ సివిల్‌ జడ్జి పాల్గొని మాట్లాడారు. లీగల్‌ సర్వీసెస్‌ యాక్ట్‌, బాల కార్మిక చట్టాలు, సీనియర్‌ సిటిజన్‌, వ్యవసాయకార్మిక చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. ప్రజలు తప్పకుండా ఈశ్రమ్‌ బీమా పాలసీని నమోదు చేసుకోవాలని సూచించారు. అగ్రి లీగల్‌ఎడ్‌ క్లీనిక్‌ను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, న్యాయవాది రాజేష్‌, వ్యవసాయాధికారి రాంపాల్‌, వైస్‌ఎంపీపీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జన్‌ ఆరోగ్య సమితులు

- ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటుకు చర్యలు
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ హెల్త్‌ సబ్‌ సెంటర్లలో కమిటీలు
- ప్రతినెలా మూడో శనివారం సమావేశాల నిర్వహణ
- ప్రజా వైద్యం, నిధుల వినియోగంపై పర్యవేక్షణ
- ఆదేశాలు జారీచేసిన కేంద్ర ప్రభుత్వం



అచ్చంపేట ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రి

అచ్చంపేట: ఆరోగ్య కేంద్రాలను ఆయుష్మాన్‌ భారత్‌ హెల్త్‌ వెల్‌నెస్‌ సెంటర్లుగా గుర్తించి పటిష్ట నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, నిర్వహణ, నిధుల వినియోగం, రోగుల సంక్షేమాన్ని పర్యవేక్షించడానికి జన్‌ ఆరోగ్య సమితిల ఏర్పాటుకు మార్గదర్శకాలు విడుదల చేసింది. జిల్లాలోని జనరల్‌ ఆస్పత్రి, ఆరు వైద్య విధాన పరిషత్‌ ఆస్పత్రులు, 27 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), ఒక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ), రెండు బస్తీ దవాఖానాలు, 124 పల్లె దవాఖానాలు, 54 హెల్త్‌ సబ్‌ సెంటర్లలో ఈ సమితులు ఏర్పాటు చేయనున్నారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో డెవలప్‌మెంట్‌ సొసైటీ (హెచ్‌డీఎస్‌)లు పర్యవేక్షించేవి. ఇప్పుడు వాటి స్థానంలో జన్‌ ఆరోగ్య సమితుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రతినెలా మూడో శనివారం కమిటీల సమావేశం నిర్వహిస్తారు. ఆయా ఆరోగ్య కేంద్రాల్లోకి వచ్చే రోగుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, వసతులు, సౌకర్యాలు, వైద్య పరికరాలు, అవసరమైన మందుల కొనుగోలు, వచ్చిన నిధుల వినియోగం, ఖర్చు, భవిష్యత్‌ కార్యాచరణపై చర్చించి చర్యలు తీసుకోనున్నారు.

పక్కాగా అమలు..

జన్‌ ఆరోగ్య సమితి కమిటీల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో చైర్మన్‌గా ఎంపీపీ, వైస్‌ చైర్మన్‌గా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, మెంబర్‌ సెక్రటరీలుగా మెడికల్‌ ఆఫీసర్‌, స్టాఫ్‌ నర్సు, ఏఎన్‌ఎం, సీడీపీఓ లేదా ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌, తహసీల్దార్‌, ఎంఈఓ, స్పెషల్‌ ఇన్‌వైట్‌గా టీబీ విభాగం సూపర్‌వైజర్‌, వీహెచ్‌ఎస్‌ఎన్‌సీ చైర్మన్‌ లేదా సభ్యుడు లేదా స్వయం సహాయ సంఘాల సభ్యులు ఉంటారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) స్థాయిలో చైర్మన్‌గా ఏరియా వార్డు సభ్యుడు, కోచైర్మన్‌ మెంబర్‌, సెక్రటరీలుగా మెడికల్‌ ఆఫీసర్‌, ఎక్స్‌ అఫీషియో మెంబర్లుగా ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌, పబ్లిక్‌ హెల్త్‌ ఇంజినీరింగ్‌ డిపార్ట్‌మెంట్‌ ప్రతినిధి సభ్యులుగా మహిళా స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు, స్పెషల్‌ ఇన్‌వైటర్స్‌గా విలేజ్‌ హెల్త్‌ శానిటేషన్‌ అండ్‌ న్యూట్రిషన్‌ కమిటీ (వీహెచ్‌ఎస్‌ఎన్‌సీ) సభ్యులు ఉంటారు. హెల్త్‌ సబ్‌ సెంటర్‌ స్థాయిలో చైర్మన్‌గా సర్పంచ్‌, కోచైర్మన్‌ పర్సన్‌గా సంబంధిత పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌, మెంబర్‌ సెక్రటరీగా హెల్త్‌ వెల్‌నెస్‌ సెంటర్‌ మిడ్‌ లెవల్‌ హెల్త్‌ ప్రొవైడర్‌ (ఎంఎల్‌హెచ్‌పీ), ఎక్స్‌ అఫీషియో మెంబర్లుగా విలేజ్‌ హెల్త్‌ శానిటేషన్‌ అండ్‌ న్యూట్రిషన్‌ కమిటీ అధ్యక్షులు, ఆశాలు ఉంటారు. ఆరోగ్య సమితి కమిటీ సమావేశంలో 50 శాతం కోరం తప్పనిసరి. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రాల్లో మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన హెచ్‌డీఎస్‌ సమావేశాలు కొంతకాలంగా అటకెక్కాయి. చాలాచోట్ల నిధులు ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో జన్‌ ఆరోగ్య సమితులు ఏర్పాటైతే నిర్వహణ, నిధుల వినియోగంలో పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నారు.

త్వరలోనే ఏర్పాటు చేస్తాం..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు, యూపీహెచ్‌సీ హెచ్‌డీఎస్‌ స్థానంలో జన్‌ ఆరోగ్య సమితులు ఏర్పాటు చేస్తాం. పకడ్బందీగా ప్రతినెలా సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. త్వరలోనే కమిటీలను ఏర్పాటు చేస్తాం. కమిటీలో ఉండే సభ్యులు ప్రతిఒక్కరూ సమావేశానికి హాజరై నిధుల వినియోగం, ఆరోగ్య సేవలు, సౌకర్యాలపై చర్చించి అడిగి తెలుసుకొని సూచనలు, సలహాలు ఇచ్చే అవకాశం ఉంటుంది.

– వెంకటదాస్‌, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

విద్యారంగ ప్రగతిపై అవగాహన



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

కందనూలు: జిల్లాలో ప్రభుత్వ విద్యారంగం సాధించిన ప్రగతిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సభలు, సమావేశాలను నిర్వహించి సాధిస్తున్న ఫలితాల గురించి చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించే విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ‘మన బడి’ నిధులతో ఆధునికీకరించిన 28 పాఠశాలలను మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా గురువారం ఆయన తిమ్మాజిపేట మండలంలోని మరికల్‌ ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, సమాచార బదలాయింపు కోసం జిల్లాలోని 609 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను అందిస్తామన్నారు. అలాగే 65 ఉన్నత పాఠశాలల్లో డిజిటల్‌ తరగతులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు, ఉచితంగా పాఠ్యపుస్తకాలను అదేరోజు అందజేస్తామన్నారు. మరికల్‌ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలను ఆయన పరిశీలించారు. మన ఊరు– మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించి విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని సూచించారు.

న్యూస్‌రీల్‌

రెండోరోజు కొనసాగిన ధ్రువపత్రాల పరిశీలన



నాగర్‌కర్నూల్‌ క్రైం: పోలీస్‌ కానిస్టేబుల్‌, ఎస్‌ఐ రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం ఎస్పీ కార్యాలయంలో గురువారం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా 500 మంది అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్‌ చేయించుకున్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 23 వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ కొనసాగనుంది.

నేడు టెలీకాన్ఫరెన్స్‌

కందనూలు: డూ ఇట్‌ యువర్‌, సెల్ఫ్‌ సైన్స్‌ హాకథాన్‌ అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదును పెట్టేలా తక్కువ వ్యయంతో ప్రజలకు ఉపయోగపడే ప్రయోగాలను రూపొందించడంలో మెలకువలను వివరించడానికి, యూట్యూబ్‌ లింకులో నమోదు చేసే ప్రక్రియను వివరించడానికి శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి టీశాట్‌ నెట్‌వర్క్‌, నిపుణ చానల్‌లో టెలీ కాన్ఫరెన్స్‌ ఉంటుందని డీఈఓ గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్‌ స్కూళ్లలో పనిచేస్తున్న సైన్స్‌, గణిత ఉపాధ్యాయులు విధిగా చూడాలని సూచించారు.

జీ20 సదస్సు దేశానికే గర్వకారణం



బిజినేపల్లి: ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్‌ అనే లక్ష్యంతో వివిధ దేశాల మధ్య సహృద్భావ వాతావరణం, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా జీ20 సదస్సు మన దేశంలో ఏర్పాటు చేయడం గర్వకారణమని నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్‌ భాస్కర్‌కుమార్‌ అన్నారు. గురువారం మండలంలోని వట్టెం జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో జీ20 సామాజిక చైతన్య సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీ20 దేశాల సమితికు భారతదేశం అధ్యక్షత వహించడం గర్వకారణమని, ఇలాంటి మహోన్నత ఘనతలు సాధించడానికి గల కారణాలు, ఇంకా సాధించడానికి లక్ష్యాలను చర్చించుకోవాలన్నారు. ఇందుకోసం అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్‌రావు, సర్పంచ్‌ అమృత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఉపా చట్టాన్ని విరమించుకోవాలి’

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: ప్రొఫెసర్‌ హరగోపాల్‌పై పెట్టిన ఉపా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్‌ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్‌ చేశారు. మానవ హక్కుల తన జీవితాన్ని ధారపోసిన వ్యక్తి హరగోపాల్‌ అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు శాంతియుతంగా నక్సల్‌తో చర్చలు జరిపినప్పుడు ప్రభుత్వ దూతగా పంపి, తిరిగి ఉపా చట్టాన్ని ప్రయోగించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. హరగోపాల్‌పై ఉపా చట్టాన్ని పెట్టడం అంటే దేశంలో మానవహక్కులు లేనట్లేనని పేర్కొన్నారు. పాలమూరుకు జరుగుతున్న అన్యాయంపై తన గళం విప్పిన గొప్ప సామాజికవాది హరగోపాల్‌ అని, వెంటనే ఆయనపై పెట్టిన ఉపా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి

పెబ్బేరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంతో పాటు మండలంలోని కంచిరావుపల్లి, తోమాలపల్లి, వైశాఖాపూర్‌, రంగాపూర్‌, పెంచికలపాడు, గుమ్మడం, గుమ్మడంతండా, సూగూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పల్లెప్రకృతి ఉత్సవాలు, భవన ప్రారంభోత్సవాలకు ఆయనతో పాటు కలెక్టర్‌ తేజస్‌ నందలాల్‌ పవార్‌ హాజరయ్యారు. కంచిరావుపల్లిలో గ్రామపంచాయతీ కారాలయ భవనాన్ని ప్రారంభించి వడ్డెరుల కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. స్నేహ పౌల్ట్రీఫామ్‌ నుంచి దుర్వాసన వస్తోందని.. సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు మంత్రి దృష్టికి తేగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సంపద వనాలపై ప్రత్యేక దృష్టి



పెద్దకొత్తపల్లి: సంపద వనాల పెంపకంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక దృష్టిపెట్టాలని అదనపు కలెక్టర్‌ మనూచౌదరి అన్నారు. గురువారం ఆయన మండలంలోని జొన్నలబొగుడ రిజర్వాయర్‌, వెన్నచర్ల, ఏదుల రిజర్వాయర్‌ వద్ద ఏర్పాటు చేయనున్న సంపద వనాల పనులపై అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాతాపూర్‌లో నిర్వహించిన పల్లెప్రగతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సఫాయి కార్మికులను శాలువాలతో సన్మానించారు. అనంతరం జొన్నలబొగుడ రిజర్వాయర్‌ వద్ద కొనసాగుతున్న సంపద వనాల పనులను పరిశీలించి మాట్లాడారు. ఈ సంపద వనాలను పర్యాటకులకు ఆకర్షించే విధంగా పూలు, పండ్ల మొక్కలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త సేకరణ ఎప్పటికప్పుడు చేపట్టి తడి, పొడి చెత్తను వేరుచేసి పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వర్షాలు పడిన వెంటనే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పద్మమ్మ, రాధ, ఎంపీటీసీ సభ్యులు వెంకటయ్య, రవికుమార్‌, తహసీల్దార్‌ శ్రీనివాసులు, ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీడీసిలు రవికుమార్‌ పాల్గొన్నారు.

ముక్కిడిగుండంలో ఎమ్మెల్యే పల్లెనిద్ర



కొల్లాపూర్‌ రూరల్‌: మండలంలోని ముక్కిడిగుండంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి గురువారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం గ్రామానికి చేరుకున్న ఆయన వీధుల్లో కలియతిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అంతకుముందు ముక్కిడిగుండం, గేమ్యానాయక్‌తండాలో పల్లె ప్రకృతి వనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోజ్యానాయక్‌, సర్పంచ్‌ దశరథం నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 809.1 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 809.1 అడుగుల నీటిమట్టం, 33.8136 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు నీటి విడుదల చేయలేదు.

క్లుప్తంగా

ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య


శివ(ఫైల్)

మిడ్జిల్: తాను ప్రేమించిన అమ్మాయికి వేరే అబ్బాయితో పెళ్లి జరిపించారని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మిడ్జిల్ మండలం చిల్వేర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బాల్‌చెన్నయ్య, ఆశమ్మ దంపతుల రెండో కుమారుడు శివ(22) అదే గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమించాడు. అమ్మాయి తల్లిదండ్రులు ప్రేమకు నిరాకరించి, బుధవారం అమ్మాయి పెళ్లి వేరేచోట జరిపించారు. ఈ విషయం తెలుసుకున్న శివ బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలోని దుందుబి వాగులో పురుగుల తాగాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడని ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహానికి పోస్టుమార్టం



మాగనూర్: మండల పరిధిలోని కోత్తపల్లి గ్రామానికి చెందిన వడ్డెర నర్సిములు గత మూడు రోజులు (సోమవారం తెల్లవారు జామున)క్రితం చనిపోవడం జరిగింది. అదే రోజు కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే తన భర్త మృతిపై గ్రామానికి చెందిన గుడి నర్సంహులు అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు మృతుడి భార్య వడ్డెర రేణమ్మ బుధవారం సాయంత్రం మాగనూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ నరేందర్ దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో భాగంగా శుక్రవారం మాగనూర్ డిప్యూటీ తహసీల్దార్ అమీర్ ఆధ్వర్యంలో టీమ్ ఆఫ్ డాక్టర్స్ చేత కోత్తపల్లి గ్రామ శివారులో శవాన్ని వెలికి తీసి శవ పంచనామా చేశారు. కార్యక్రమంలో మక్తల్ సీఐ సీతయ్య, గ్రామసర్పంచ్ తిమ్మప్ప, సింగిల్ విండోచైర్మన్ వెంకట్‌రెడ్డి , గ్రామపెద్దలు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏడ్ల పాపయ్య(40) స్థానిక చెరువులో చేపల వేటకు వెళ్లి మృతిచెందాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. తిమ్మాజీపేట ఎస్సై షేక్ శంషోద్దిన్ తెలిపిన వివరాలు.. పాపయ్య బుధవారం మధ్యాహ్నం చేపల వేటకు స్థానిక చెరువుకు వెళ్లి ప్రమాదశావత్తు అందులో పడ్డాడు. గమనించిన స్థానికులు కొందరు పాపయ్యను ఒడ్డుకు చేర్చి చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. అక్కడికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... భూత్పూర్ మండలం తాటికొండకు చెందిన నరేందర్ ద్విచక్ర వాహనంపై అడ్డాకుల వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మూసాపేట మండలం అచ్చాయపల్లి గ్రామానికి చెందిన బాలయ్య తన కుమార్తె శ్రావణితో కలిసి టీవీఎస్‌పై మూసాపేటకు వెళ్తున్నాడు. ఈక్రమంలో మూసాపేట ఏపీజీబీవీ బ్యాంకు ఎదురుగా హైదరాబాద్ రోడ్డుపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ముగ్గురు రోడ్డు మధ్యలో పడిపోయారు. ఇందులో బాలయ్య కుడి కాలు, నరేందర్ ముఖం, శ్రావణి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ముగ్గురికి రోడ్డు మధ్య నుంచి పక్కకు తీసుకెళ్లి పోలీసులకు సమాచారం చేరవేశారు. క్షతగాత్రులను ఎల్‌అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.



కోచ్‌ల కొరత తీరేనా..?

- ఉమ్మడి జిల్లాలో కనిపించని శిక్షకులు
- ఏళ్లతరబడిగా భర్తీకి నోచుకోని పోస్టులు
- మెళకువలు నేర్పించేవారు లేక క్రీడాకారుల వెనకబాటు
- విరివిగా నిర్మాణమవుతున్న కొత్త స్టేడియాలు
- నియామకం చేపట్టాలంటున్న సీనియర్ క్రీడాకారులు



ఇది మహబూబ్‌నగర్‌లోని ప్రధాన స్టేడియం. ఉమ్మడి జిల్లాకే తలకమానికమైన ఈ స్టేడియంలో ప్రస్తుతం ఐదుగురు కోచ్‌లే ఉన్నారు. గతంలో విరివిగా కోచ్‌లు.. ఔత్సాహిక క్రీడాకారులతో కళకళలాడిన ఈ స్టేడియం ప్రస్తుతం వెలవెలబోతోంది. 15 ఏళ్ల నుంచి మెయిన్ స్టేడియంకు కోచ్‌ల నియామకం చేపట్టడం లేదు. కేవలం అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, స్విమ్మింగ్ కోచ్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ప్రధాన క్రీడలైన కబడ్డీ, హాకీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, బాక్సింగ్, తైక్వాండో తదితర క్రీడలకు కోచ్‌లు అసలే లేరు.

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలో క్రీడారంగానికి కోచ్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న స్టేడియంలలో కోచ్‌ల కొరత తీవ్రంగా ఉంది. 2007 నుంచి స్టేడియంలలో శాశ్వత పద్ధతిన కోచ్‌లను నియామకం చేపట్టలేదు. ఇప్పుడు ఉన్న కొంతమంది కోచ్‌లు సైతం తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్నారు. ఈ క్రమంలో స్టేడియంలు ఉన్నా సరిపడా కోచ్‌లు లేకపోవడంతో ఔత్సాహిక క్రీడాకారులు క్రీడా శిక్షణకు దూరమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు తక్కువస్థాయిలో పతకాలు రావడానికి కోచ్‌ల కొరత కూడా ఒక కారణంగా భావిస్తున్నారు.

2007 నుంచి..

ఉమ్మడి జిల్లాలోని స్టేడియంలలో 2007 నుంచి శాశ్వత పద్ధతిన కోచ్‌ల నియామకం చేపట్టలేదు. మహబూబ్‌నగర్ జిల్లా యువజన, క్రీడాశాఖ పరిధిలోని జిల్లాకేంద్రం స్టేడియం, జడ్చర్ల, నారాయణపేట జిల్లాలో నారాయణపేట, మక్తల్, వనపర్తి జిల్లాకేంద్రంలో ఒకటి క్రీడాశాఖ, మరొకటి గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం, ఆత్మకూర్ స్టేడియం, నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట, కల్వకుర్తి (గ్రీన్‌ఫీల్డ్), కొల్లాపూర్ (గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం), గద్వాల జిల్లా కేంద్రంలో డీఎస్‌ఏ స్టేడియం, మరో గ్రీన్‌ఫీల్డ్, ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో (గ్రీన్‌ఫీల్డ్) స్టేడియంలు ఉన్నాయి. మొత్తం 13 స్టేడియంలకు గాను కేవలం 8 మంది కోచ్‌లే ఉన్నారు. వీటిలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఆరుగురు, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఒక్కొక్కరు పనిచేస్తున్నారు.

నియామకం చేపట్టాలి..

మహబూబ్‌నగర్ జిల్లాలో నూతన స్టేడియంల నిర్మాణం చేపడుతున్నారు. చిన్నచింతకుంట మండలం అల్లీపూర్‌లో మినీ స్టేడియం నిర్మాణమైంది. మెయిన్ స్టేడియంలో ఒక పక్క రూ.7 కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు చివరిదశలో కొనసాగుతున్నాయి. మరోపక్క వాలీబాల్ అకాడమీ ఏర్పాటైంది. జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ మైదానంలో రూ.2.65 కోట్లతో మినీ స్టేడియం, భూత్పూర్ మండలం పోతులమడుగులో రూ.3.65 కోట్లతో మినీ స్టేడియం పనులు జరుగుతున్నాయి. నూతనంగా నిర్మించే ఆయా స్టేడియంలలో సరిపడా కోచ్‌ల నియామకం చేపట్టాలని క్రీడాసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. కోచ్‌లు ఉంటేనే నైపుణ్యంగల క్రీడాకారులను వెలికితీయవచ్చని, ఈ మేరకు ప్రజాప్రతినిధులు, క్రీడాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి జిల్లాకు 8 నుంచి 10 మంది ప్రధాన క్రీడలకు కోచ్‌లు నియామకం చేపట్టాలని సీనియర్ క్రీడాకారులు సూచిస్తున్నారు.

శాట్‌కు ప్రతిపాదనలు..



స్టేడియంలలో కోచ్‌ల నియామకంపై గతంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో రానున్న నూతన క్రీడాపాలసీతో ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతో మేలు జరగనుంది. క్రీడాశిక్షణతో నైపుణ్యంగల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. గ్రామీణస్థాయి నుంచి క్రీడలను అభివృద్ధి చేసుకోవచ్చు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో ఇప్పటికే జిల్లాలో పలు స్టేడియంల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

– శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

ఆస్తిపన్ను వసూళ్లలో ప్రథమం

- అలంపూర్ మున్సిపాలిటీకి మరో అవార్డు



అలంపూర్ మున్సిపల్ కార్యాలయం

అలంపూర్: స్థానిక మున్సిపాలిటీ అరుదైన స్థానం దక్కించుకుంది. ఆస్తిపన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ నిత్యానంద్ గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 142 మున్సిపాలిటీలు ఉండగా ఆ అవకాశం అలంపూర్ మున్సిపాలిటికి దక్కింది. 2022–23 వార్షిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూలు చేయడంతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. 2022–23 వార్షిక సంవత్సరంలో ఆస్తి పన్ను డిమాండ్ రూ.34.34 లక్షలు ఉండగా అందులో రూ.31.24 లక్షల వసూలు చేసింది. దీంతో వసూళ్లలో 91 శాతం సాధించింది. గతేడాది సైతం ఆస్తి పన్ను వసూళ్లలో మొదటి స్థానంలో నిలిచి అవార్డును దక్కించుకుంది. వరుసగా రెండో సారి ఎంపిక కావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ హర్షం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మునుగాల గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

ఎర్రవల్లిచౌరస్తా: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలంపూర్ సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని మునుగాలలో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందితో సాయంత్రం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది పోలీసులు గ్రామంలోని 150 ఇళ్లను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌కు స్వచ్ఛందంగా సహకరించడం ఎంతో అభినందనీయమన్నారు. గుట్కా, మట్కా, జూదం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు చేసేవారిని గుర్తించడమే కార్డెన్‌సెర్చ్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండటం వల్ల దొంగలు అధికంగా సంచరించే ప్రమాదం ఉన్నందున ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్తవారికి ఇంటిని అద్దెకు ఇవ్వడానికి ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. గ్రామంలో అనుమానిత వ్యక్తుల సంచారం ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఒకే ప్రాంతంలో నివాసముండే ప్రజలంతా కలిసిమెలిసి జీవించాలని, అనవసరంగా చిన్న విషయాలకు గొడవ పడి సమాజ శాంతికి భంగం కలిగించరాదని కోరారు. మైనర్లు వాహనాలు నడపరాదని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. ప్రజలు పోలీసులను స్నేహితులుగా భావించి చట్టపరమైన సమస్యలు వచ్చినప్పుడు సంప్రదించాలన్నారు. మహిళల సంరక్షణ కోసం ప్రత్యేకంగా షీటీంలను ఏర్పాటు చేశామని, ఎలాంటి వేధింపులకు గురైనా లేక ఎలాంటి ఆపదలో ఉన్నా వెంటనే 100కు డయల్ చేసి అపాయం నుంచి బయటపడాలన్నారు. కార్యక్రమంలో ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు గోకారి, మహేందర్, బాలరాజు, వెంకటస్వామి, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

తెల్లబంగారం ఎర్రబడింది


బల్గెర శివారులో గొర్రెలు మేస్తున్న సీడ్ పత్తి పంట

గట్టు: తెల్ల బంగారానికి కొత్త కష్టం వచ్చింది. వానాకాలం ప్రారంభంలోనే ఎర్ర తెగులు సీడ్ పత్తి రైతులను నిలువునా ముంచేశాయి. నెలరోజుల క్రితం నీటి వసతి ఉన్న రైతులు సాగు చేసుకున్న సీడ్ పత్తి మొక్కలు విపరీతమైన ఎండల కారణంగా ఎర్ర తెగులు సోకడంతో గత్యంతరం లేక తొలగిస్తున్నారు. వేసవిలో మురిపించిన వరుణుడు తర్వాత ముఖం చాటేయడంతో ఇదివరకే సీడ్ పత్తి నాటిన రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోహిణి పోయి.. మృగశిర కార్తె వచ్చినా వాతావరణం చల్లబడకపోవడంతో ఎర్ర తెగులు వ్యాపిస్తున్నాయి. ఇప్పటి దాకా రూ.50 వేల వరకు పెట్టుబడులు పెట్టినట్లు కొందరు రైతులు వాపోయారు. మండలంలోని చాలా గ్రామాల్లో సీడ్ పత్తికి ఎర్ర తెలుగు సోకడంతో పత్తి మొక్కలను రైతులు తొలగించి, మళ్లీ నాటుకునేందుకు సిద్ధమవుతున్నారు. బల్గెర గ్రామానికి చెందిన మొగిలి భీమయ్య, మొగిలి నర్సప్పలు 4 ఎకరాల్లో సీడ్ పత్తి సాగు చేయగా, ఎర్ర తెగులు కారణంగా 45 రోజుల పత్తి మొక్కలను గొర్రెలను వదిలారు.

యువకుడి బలవన్మరణం

జడ్చర్ల: కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొత్తతండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లెనిన్ కథనం మేరకు.. కొత్తతండాకు చెందిన ముడావత్ శంకర్(28) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అయితే కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. నాటు వైద్యం చేయించుకున్నా.. నయం కాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడేవాడు. ఈ క్రమంలో బుధవారం పని నిమిత్తం జడ్చర్లకు వెళ్లి.. కడుపు నొప్పి వస్తుందని చెప్పి తిరిగి ఇంటికి వచ్చాడు. తరువాత ఇంటి పై గదిలో పడుకుంటానని చెప్పి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం మృతుడి భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ జెండాకు అవమానం



ఊట్కూరు: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చేపట్టిన పల్లెప్రగతి దినోత్సవంలో తిమ్మారెడ్డిపల్లితండాలో జాతీయ పతాకానికి అవమానం జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు. పంచాయతీ దగ్గర జాతీయ పతాకాన్ని అధికారులు నిర్లక్ష్యంగా ఆకుపచ్చ రంగు పైకి చేసి ఎగరవేశారు. దీనిపై ఎంపీడీఓ కాళప్పను 'సాక్షి' వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని చెప్పారు.

వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దు

- నారాయణపేట ఎస్పీ వెంకటేశ్వర్లు



నారాయణపేట: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురై వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. లోన్ యాప్స్ అప్పు ప్రాణాలకు ముప్పు అని, సైబర్ నేరగాళ్ల నుంచి జాగ్రత్తగా ఉండడమే రక్ష అన్నారు. గురువారం ఎస్పీ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం 5జీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయని, ఈ సేవలు పొందాలంటే 5జీ సిమ్‌కార్డు సపోర్టు చేసే ఫోన్ ఉండాలే తప్ప లింకులు, యాప్స్, ఓటీపీలు కావన్నారు. అలాగే పండుగలకు షాపింగ్ చేసే సమయంలో ఇచ్చే లాటరీ కూపన్లలోనూ వ్యక్తిగత వివరాలు చెప్పొద్దని, ఒకవేళ లాటరీ కూపన్‌లో నమోదు చేసే ఫోన్ నంబర్, మెయిల్ ఐడీ నమోదు చేస్తే వ్యక్తిగత వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తెలియని నంబర్, వాట్సప్, ఇతరత్రా సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో కలవకపోవడమే ఉత్తమం అన్నారు. ఎవరైనా లోన్‌యాప్ పేరుతో వేధింపులకు పాల్పడితే 1930 లేదా 100కి డయల్ చేసి పోలీసులు సమాచారం ఇవ్వాలని సూచించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్ గ్రామంలో గురువారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని బోయ మధు ఇంట్లో గురువారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో ఇంట్లో ఉన్న కరెంట్ పరికరాలు, నగదు, ఆస్తి పేపర్లు, బీరువా, వస్త్రాలు, నిత్యావసర సరుకులు పూర్తిగా దగ్ధమై.. సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మహిళా న్యాయవాది ఆందోళన

జడ్చర్ల: తనపై తప్పుడు కేసు నమోదు చేసిన పోలీసులు, ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఓ మహిళా న్యాయవాది గురువారం స్థానిక కోర్టు రోడ్డుపై బైఠాయించింది. బాధితురాలు అఫీజాబీ కథనం మేరకు.. ఇందిరానగర్‌లో తన ఇంటిపక్కన ఉన్న స్థల వివాదానికి సంబంధించి తాను పోలీసులకు ఫిర్యాదు చేయగా, పట్టించుకోకుండా తనకు వ్యతిరేకంగా ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించి, తనపైనే ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేశారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా అఫిజాబీపై కాలనీకి చెందిన వారు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.


రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న అఫిజాబీ

కలుపు నివారణ కీలకం

- ఆరుతడి పంటల సాగులో యాజమాన్య పద్ధతులు
- అలంపూర్ ఏడీఏ సక్రియానాయక్ సూచనలు, సలహాలు

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


మొక్కజొన్న పంటలో పెరిగిన గరిక కలుపు

అలంపూర్: వానాకాలం పంట సీజన్ ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతోంది. వివిధ పంటల సాగులో కలుపు సమస్య ప్రధానంగా ఉంటుంది. కలుపు వలన 30 నుంచి 70 శాతం పంట నష్టం జరిగే అవకాశం ఉంది. అయితే ఈ కలుపును నివారించుకోవడానికి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ ఏడీఏ సక్రియానాయక్ చెప్పారు. సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

- మొక్కజొన్న విత్తిన వెంటనే లేదా 2- 3 రోజుల్లో ఎకరాకు 1- 1.5 కిలోల అట్రాజీన్ పిచికారీ చేయాలి. తర్వాత 30- 35 రోజుల్లో గొర్రు గంటుకతో అంతర్ కృషి చేయాలి.
- జొన్న విత్తిన వెంటనే లేదా 2- 3 రోజుల్లో 600 నుంచి 800 గ్రాముల అట్రాజిన్‌ను విత్తిన 20 రోజుల తర్వాత అయితే 400 గ్రాముల 2,4-డి సోడియం సాల్ట్ 80 శాతం పొడిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- కంది విత్తిన వెంటనే 1- 2 రోజుల్లో ఎకరాకు 1.1.3 లీ., పెండిమిథాలిన్ వాడాలి. విత్తిన 30- 60 రోజుల్లో గొర్రు గుంటుకతో అంతర్ కృషి చేయాలి. లేదా ఇమిజితాపీర్ ఎకరాకు 200 మి.లీ., పిచికారీ చేయాలి.

మినుము/పెసర : విత్తిన 1- 2 రోజుల్లో ఎకరాకు 1-1.3 లీ పెండిమీథాలిన్‌ను విత్తిన 20 రోజులకు గడ్డి జాతి కలుపు నివారణకు 250 మి.లీ., పెనాక్స్ ప్రాప్ ఇథైల్ 5 శాతం మందును 200 లీటర్ల నీటిలో కలిపి చల్లాలి.

మినుములు : పొలంలో గడ్డిజాతి వెడల్పాకు కంటే ఎకరాకు 200 మి.లీ., ఇమిజితాపిర్ 10 శాతం పొడి పిచికారీ చేయాలి. ఈ మందు చల్లితే మినుము పెరుగుదల వారంపాటు ఆగినప్పటికీ తిరిగి మాములు స్థితికి వస్తోంది.


శనగ : పైర్లు విత్తిన వెంటనే లేదా ఒకటి లేక రెండు రోజుల్లో ఎకరాకు 1- 1.3 లీ., పెండిమిథాలిన్ పిచికారీ చేయాలి. సోయా చిక్కుడులో విత్తిన 20 రోజుల సమయంలో 250 మి.లీ., ఇమిజితాపిర్ మందు కూడా పిచికారీ చేయవచ్చు.

వేరుశనగ : విత్తిన వెంటనే లేదా 1- 2 రోజుల్లో ఎకరాకు 1-1.6 లీ., పెండిమిథాలిన్ లేదా 1.5-2 లీ., బుటాక్లోర్ 50 శాతం విత్తిన 20- 25 రోజుల సమయంలో గడ్డి జాతి కలుపు నిర్మూలనకు ఎకరాకు ఫైనక్సాప్రాప్ ఇథైల్ పిచికారీ చేయాలి.

పత్తి : విత్తిన వెంటనే లేదా 1- 2 రోజుల్లో ఎకరాకు 1-1.3 లీ., పెండిమిథాలిన్ 45 శాతం లేదా 1.5-2 లీ., అలాక్లోర్ 50 శాతం వాడాలి. ఖరీఫ్‌లో వర్షాలు ఎక్కువ ఉండి అంతర్ కృషి కుదరనప్పుడు 400 మి.లీ., క్విజలాపాప్ ఇథైల్+250 మి.లీ., పైరితయోబాక్ 10 శాతం పత్తిమీద పడకుండా సాళ్ల మధ్య కలుపుపై పడేలా చల్లాలి.

చెరకు : ముచ్చెలు నాటిన వెంటనే లేదా 2-3 రోజుల్లో ఎకరాకు 2 కిలోల అట్రడాజిన్ పిచికారీ చేయాలి. వెడల్పాటి ఆకులు ఎక్కువగా ఉంటే తోట నాటిన తర్వాత 30- 60 రోజుల్లో ఎకరాకు అరకిలో 2, 4-డి సోడియం సాల్ట్ చల్లాలి. లేదా దీనికి అరకిలో మెట్రిబుజిన 70 శాతం కలిపి పైరుపై పడకుండా సాళ్ల మధ్య పిచికారీ చేయాలి.

మిరప : నాటడానికి 1-2 రోజుల ముందు ఎకరాకు 1.3-1.6 లీ. పెండిమిథాలిన్ లేదా 200 మి.లీ., ఆక్సిఫ్లోరోఫిన్ (23.5 శాతం) పిచికారీ చేయాలి. నాటిన 25- 30 రోజుల తర్వాత సాళ్ల మధ్య గొర్రు లేదా గుంటుక తోలాలి. గడ్డి జాతి కలుపు నిర్మూలనకు 400 మి.లీ., క్విజాలాపాప్ ఇథైల్ పిచికారీ చేయాలి.


పల్లెరు


గురుగాకు కలుపు

ఆడిటర్ సహా.. విశాఖ ఎంపీ భార్య, కొడుకు కిడ్నాప్

4 గంటల్లోనే కథ సుఖాంతం

- రెండ్రోజుల క్రితం ఎంపీ కుమారుడు శరత్ ఇంట్లో చొరబడిన దుండగులు
- అతడితోనే ఫోన్ చేయించి తల్లిని రప్పించిన కిడ్నాపర్లు
- ఆమె ద్వారా ఆడిటర్ జీవీని పిలిపించి నిర్బంధం
- ముగ్గురి మెడపై కత్తిపెట్టి డబ్బు ఇవ్వాలంటూ బెదిరింపులు
- రూ.1.75 కోట్లు ఇచ్చినా.. ఇంకా కావాలంటూ డిమాండ్
- గురువారం ఉదయం వెలుగులోకి వచ్చిన కిడ్నాప్ వ్యవహారం
- సినీ ఫక్కీలో కిడ్నాపర్లను నాలుగు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

దొండపర్తి (విశాఖ దక్షిణ)/విశాఖ విద్య: విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య, కుమారుడితో పాటు ప్రముఖ ఆడిటర్ జీవీ కిడ్నాప్ వ్యవహారం గురువారం సంచలనం రేకెత్తించింది. సినీ ఫక్కీలో దుండగులు ఎంపీ కుమారుడు శరత్ ఇంట్లోకి చొరబడి.. ముగ్గురి మెడపై కత్తిపెట్టి డబ్బులు డిమాండ్ చేశారు. 48 గంటల పాటు నిర్బంధించారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. కానీ, పోలీసులు నాలుగు గంటల్లోనే కిడ్నాపర్ల ఆచూకీని కనిపెట్టి సినిమా స్టైల్లో వెంబడించి రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్‌కుమార్, రాజేష్‌లను అరెస్టుచేయడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది. వారి చెర నుంచి ఎంపీ ఎంవీవీ భార్య జ్యోతి, కుమారుడు శరత్, ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జీవీ) సురక్షితంగా బయటపడ్డారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో మరో ఐదుగురి పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు. వివరాలివీ..


నిందితుడు హేమంత్ కుమార్ (ఫైల్)

కిడ్నాప్ జరిగింది ఇలా..

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుమారుడు శరత్ రుషికొండ ప్రాంతంలో తారకరామ లేఅవుట్‌లో ఉంటున్నారు. ఈనెల 13వ తేదీ ఉదయం కొందరు దుండగులు ఆ ఇంట్లోకి చొరబడ్డారు. లోపల శరత్ ఒక్కడే ఉండడంతో అతడిని నిర్బంధించి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకున్నారు. ఇంకా డబ్బు కావాలని దాడిచేశారు. తన వద్ద లేదని చెప్పినా వినలేదు. దీంతో మరుసటి రోజు బుధవారం శరత్‌తో లాసెన్స్ బే కాలనీలో ఉంటున్న తల్లి జ్యోతికి ఫోన్ చేయించారు. తన ఆరోగ్యం బాగోలేదని, ఇంటికి రావాలని బలవంతంగా చెప్పించారు. అది నిజమని నమ్మిన అతడి తల్లి జ్యోతి కంగారుగా బుధవారం కొడుకు ఇంటికి వచ్చారు. ఆమెను కూడా బంధించి ఆమె వద్ద ఉన్న బంగారు నగలను కాజేశారు. భారీగా డబ్బులు కావాలన్న ఉద్దేశంతో ఎంపీతో సన్నిహితంగా ఉండే ప్రముఖ ఆడిటర్ జీవీకి జ్యోతితో ఫోన్‌చేసి రప్పించారు. జీవీని కూడా నిర్బంధించి రూ.2 కోట్లు కావాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని ముగ్గురి మెడపై కత్తిపెట్టి బెదిరించారు. దీంతో జీవీ తనకు తెలిసిన వారికి ఫోన్‌చేసి రూ.1.75 కోట్లు సమకూర్చి వారికి అందించారు. అయినప్పటికీ వారిని విడిచిపెట్టకుండా ఇంకా డబ్బులు కావాలని కిడ్నాపర్లు డిమాండ్ చేశారు. మధ్యలో ఎంపీ తన కుమారుడు శరత్‌కు ఫోన్‌చేసినప్పటికీ కిడ్నాపర్ల సూచనల మేరకు మామూలుగానే మాట్లాడి ఫోన్ పెట్టేశారు.

ఎంపీ ఎంవీవీకి అనుమానం వచ్చి..

ఐటీ రిటర్నుల పనుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్న ఎంపీ ఎంవీవీ.. ఆడిటర్ జీవీకి బుధవారం మధ్యాహ్నం నుంచి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయలేదు. అతడి సన్నిహితులకు ఫోన్‌చేయగా.. శ్రీకాకుళం వెళ్లినట్లు చెప్పారు. అక్కడి వారికి ఫోన్‌చేసి ఆరాతీస్తే శ్రీకాకుళం కూడా రాలేదని సమాచారమిచ్చారు. జీవీకి ఏమైందన్న ఆందోళనతో ఎంపీ విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మకు ఫోన్‌చేసి అతని నంబర్‌ను ట్రాక్ చేయాలని కోరారు. పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా జీవీ రుషికొండలోనే ఉన్నట్లు గుర్తించారు. అతని డ్రైవర్‌తో పాటు మరికొంత మంది ద్వారా సమాచారం సేకరించి సాంకేతికత సాయంతో విచారణ చేపట్టారు. దీంతో కిడ్నాప్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

సినీ ఫక్కీలో ఛేజ్ చేసి..

మరోవైపు.. రెండ్రోజులుగా ముగ్గురిని ఇంట్లోనే నిర్బంధించిన విషయాన్ని పోలీసులు గుర్తించే అవకాశం ఉందని గ్రహించిన కిడ్నాపర్లు వారిని అక్కడ నుంచి విజయనగరం వైపు తరలించేందుకు ప్రయత్నించారు. శరత్‌కు చెందిన ఆడి కారులో వారిని ఎక్కించుకుని పద్మనాభం నుంచి ఎస్.కోట మీదుగా విజయనగరం వెళ్లేందుకు బయల్దేరారు. పోలీసులు అప్పటికే మొబైల్స్, ఇతర టెక్నాలజీల ఆధారంగా ప్రతి ప్రాంతంలోనూ చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. వారు ఆనందపురం మీదుగా పద్మనాభం వైపు వెళ్తున్నట్లు తెలుసుకుని వారి కారును వెంబడించారు. ఆనందపురం మండలం పందలపాక గ్రామానికి వారి కారు చేరుకోగానే ముందు నుంచి పద్మనాభం సీఐ బృందం, వెనుక నుంచి పీఎంపాలెం సీఐ బృందాల వాహనాలు అడ్డగించాయి. అయినప్పటికీ కిడ్నాపర్లు కారు ఆపకుండా ముందుకు వెళ్లే ప్రయత్నంలో పోలీస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. వెంటనే కారులో ఉన్న కిడ్నాపర్లు రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్‌కుమార్, రాజేష్‌లు బయటకు దిగి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. ఎంపీ కుటుంబ సభ్యుల కోసం ఆరా తీశారు. అయితే, వారిని బాకురుపాలెం ప్రాంతంలోనే విడిచిపెట్టినట్లు చెప్పడంతో మరో పోలీస్ బృందం వారికోసం గాలింపు చేపట్టింది. ఇంతలో వారు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నట్లు తెలుసుకుని వారిని సురక్షితంగా కమిషనరేట్‌కు తరలించారు.

తెయూ విద్యార్థుల ఆకలికేకలు


తండాలో భిక్షాటన చేస్తున్న విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో హాస్టల్స్ విద్యార్థుల ఆకలి కేకలు మిన్నంటాయి. జీతాల కోసం తెయూ అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగి మంగళవారం మధ్యాహ్నం నుంచి వంటలు చేయట్లేదు. దీంతో విద్యార్థులు పస్తులుంటున్నారు. బుధవారం ఉదయం అల్పాహారం 11 గంటలకు రాగా మధ్యాహ్న భోజనం సాయంత్రం 5.30కి వచ్చింది. ఇక గురువారమైతే భోజనాలు లేకుండా పోయాయి. దీంతో హాస్టల్స్ విద్యార్థులు తెయూ మెయిన్ గేటు ఎదుట ఖాళీ ప్లేట్లతో బైఠాయించి నిరసన చేపట్టారు. కొందరు విద్యార్థులు పక్కనే ఉన్న నడిపల్లి తండాకు వెళ్లి ఇంటింటికీ తిరిగి భిక్షాటనతో కడుపు నింపుకున్నారు. వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ నిర్లక్ష్యం వల్ల అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు రాలేదనీ, వారు సమ్మె బాట పట్టడంతో క్యాంపస్ హాస్టల్స్ విద్యార్థులు అన్నం లేక పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టుపట్టి పరిహారం సాధించిన ‘మహా’రైతులు

కాళేశ్వరం: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా రైతులు కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురవుతున్న పంట భూములకు అక్కడి ప్రభుత్వంతో పట్టుపట్టి నష్ట పరిహారం సాధించారు. రూ.26 కోట్ల పరిహారం చెక్కులను గురువారం సిరొంచలోని తహసీల్దార్ కార్యాలయంలో గడ్చిరోలి ఎంపీ అశోక్‌నేతే, ఎమ్మెల్సీ రాందాస్ అంబేడ్కర్‌ల చేతుల మీదుగా 300 మంది రైతులకు అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ ప్రభుత్వం గోదావరిపై నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీ అవతలి వైపు సిరొంచలోని 11 గ్రామాల రైతులు నాలుగేళ్లుగా ముంపుతో పంటలు నష్టపోతున్నారు. 128 హెక్టార్ల భూమికి రూ.37 కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉండగా, తెలంగాణ ప్రభుత్వం రూ.11 కోట్ల పరిహారాన్ని ఇచ్చింది. మిగతా పరిహారం కోసం రైతులు ఒత్తిడి తేవడంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఆ పరిహారం అందజేసింది.

‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపిన ‘మహా’రైతులు

పరిహారంకోసం రెండు సార్లు రిలే దీక్షలు చేసిన మహారాష్ట్ర రైతుల పక్షాన ‘సాక్షి’పలుమార్లు కథనాలు ప్రచురించింది. దీంతో తమకు సాక్షి బాసటగా నిలిచిందని బాధిత రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కొలనుపాకలో మఠాలన్నీ ఒకప్పుడు జైన బసదులే


జైన ఆలయంలో కాకతీయ శైలిలో నల్లరాతి స్తంభం

ఆలేరు రూరల్: కొలనుపాకలో శైవ దేవాలయాలుగా భావిస్తున్న కుల మఠాలన్నీ ఒకప్పుడు జైన బసదులే అని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. గురువారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక జైన దేవాలయాన్ని సందర్శించారు. ఆలయంతో పాటు ప్రాంగణంలోని కట్టడాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కూటుల పాలన చివరి దశలో జైన దేవాలయాలు శైవ దేవాలయాలుగా మారాయన్నారు. కళ్యాణి చాళుక్యుల సమయంలోనే జైన బసదులను కూల్చి శివాలయాలుగా మార్చారన్నారు. జైన దేవాలయం ఎదురుగా ఉన్న తోటలో తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో శివలింగం, దేవాలయ శిథిలాలున్నాయన్నారు. జైన ఆలయం ఎదుట రోడ్డుకు అవతల దేవాలయ శిథిలాలు పెద్దసైజు ఇటుకల కింద ఇప్పటికీ ఉన్నట్లు తెలిపారు.

‘మార్గదర్శి’ చరాస్తులు రూ.242.03 కోట్లు అటాచ్

- వీటిలో 40 మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు, డిపాజిట్లు
- చిట్టీల మొత్తం చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్న ‘మార్గదర్శి’
- చందాదారుల ప్రయోజనాల పరిరక్షణకు సీఐడీ కఠిన చర్యలు
- మొత్తం రూ.1,035.53 కోట్ల అటాచ్‌మెంట్‌కు నిర్ణయం
- ఇంతకు ముందు రూ.793.50 కోట్ల చరాస్తులు అటాచ్



సాక్షి, అమరావతి: ఆర్థిక అక్రమాలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంసీఎఫ్ఎల్)పై మరిన్ని కఠినచర్యలకు సీఐడీ ఉపక్రమించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు చెందిన రూ.242.03 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు సిద్ధమవుతోంది. వాటిలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ 40 మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన పెట్టుబడులు, బ్యాంకుల్లో డిపాజిట్లు కూడా ఉన్నాయి. సీఐడీ వినతి మేరకు హోంశాఖ గురువారం ఇందుకు సంబంధించి అనుమతి జారీ చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొన్నాళ్లుగా చందాదారులకు చిట్టీల మొత్తాన్ని చెల్లించడంలో జాప్యం చేస్తోంది. దీంతో చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సీఐడీ కఠిన చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల క్రితమే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన రూ.793.50 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. తాజాగా రూ.242.03 కోట్లతో కలిపి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన మొత్తం రూ.1,035.53 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు సీఐడీ సన్నద్ధమవుతోంది.

అగమ్యగోచరంగా మార్గదర్శి

కేంద్ర చిట్‌ఫండ్ చట్టం, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలకు పాల్పడుతోందని రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తనిఖీల్లో వెల్లడైంది. ఆ శాఖ ఫిర్యాదు మేరకు సీఐడీ విభాగం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసింది. ఆ సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావును ఏ-1గా, ఎండీ చెరుకూరి శైలజ కిరణ్‌ను ఏ-2గా, బ్రాంచి మేనేజర్లను ఏ-3గా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సీఐడీ అధికారులు చేసిన సోదాల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ దశాబ్దాలుగా పాల్పడుతున్న ఆర్థిక అక్రమాలు ఆధారాలతో సహా బట్టబయలయ్యాయి. కాగా మరోవైపు కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని కచ్చితంగా పాటించాలని రాష్ట్ర చిట్స్ రిజిస్ట్రార్ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు స్పష్టం చేశారు. ఆ చట్టం ప్రకారం చందాదారుల సొమ్మును ఇతర అవసరాలకు మళ్లించకూడదు. ఏ బ్రాంచి చందాదారుల సొమ్మును అదే నగరం/పట్టణంలోని జాతీయ బ్యాంకులోని ఖాతాలో జమ చేయాలి. కానీ రామోజీరావు చందాదారుల సొమ్మును హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలించి, అక్కడి నుంచి సొంత కంపెనీలలోకి మళ్లిస్తున్నారు. ఆ సంస్థల ద్వారా మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లలో పెట్టుబడిగా పెడుతున్నారు. ఇది కేంద్ర చట్టానికి విరుద్ధం. కేంద్ర చట్టాన్ని పాటించేందుకు ససేమిరా అంటున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ గత ఏడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలను వేయడం లేదు. దాంతో ఇప్పటికే దాదాపు రూ.400 కోట్ల వరకు టర్నోవర్ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో పాత చందాదారులకు చిట్టీ పాటల మొత్తాన్ని చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. దీనిపై ఇప్పటికే పలువురు చందాదారులు చిట్స్ రిజిస్ట్రార్, సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో చందాదారుల హక్కుల పరిరక్షణ కోసం మార్గదర్శి చిట్‌ఫండ్స్ చరాస్తులను జప్తు చేయాల్సిన అవసరం ఉందని సీఐడీ భావించింది. అగ్రిగోల్డ్ కంపెనీ తరహాలో రాబోయే రోజుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం చేతులెత్తేస్తే చందాదారుల సొమ్మును వారికి తిరిగి చెల్లించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ చరాస్తులను అటాచ్ చేసేందుకు అనుమతి కోరుతూ సీఐడీ విభాగం త్వరలోనే న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయనుంది.

మంత్రి ‘గంగుల’ను అడ్డుకున్న దళితులు

- దళితబంధు ఇవ్వాలంటూ ఆందోళన


దళితులతో మాట్లాడుతున్న మంత్రి కమలాకర్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో దళితబంధు పథకాన్ని తమకూ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంత్రి గంగుల కమలాకర్‌ను దళితులు అడ్డుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి కమలాకర్‌ను వేదిక వద్దకు వెళ్లకుండా అడ్డుకుని బైఠాయించారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో ఆగ్రహించిన దళితులు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. పక్క గ్రామంలో దళితబంధు అమలు చేశారని, చెర్లభూత్కూర్‌లో ఎవరికీ ఎందుకివ్వలేదని నిలదీశారు. విడతల వారీగా అందరికీ ఇస్తామని మంత్రి హామీనివ్వడంతో దళితులు ఆందోళన విరమించారు.


దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి టౌన్: ఉమ్మడి జిల్లాలోని ఏకైక ఏకలవ్య గురుకుల పాఠశాలలో నాన్‌టీచింగ్‌లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజియన్ ప్రాంతీయ అధికారి నాగార్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్దండ మండలంలోని గుండాలలో కొనసాగుతున్న ఏకలవ్య పాఠశాలలో స్టాఫ్‌నర్సు, సీనియర్ సెక్రటరియేట్ అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, లైబ్రేరియన్, నైట్ వాచ్‌మెన్ మహిళ, పురుషుడు, కుక్, హెల్పర్, స్వీపర్, సెక్యూరిటీ గార్డు పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులు ఏకలవ్య గురుకుల పాఠశాలలో దరఖాస్తులు ఈ నెల 24లోగా అందజేయాలని కోరారు. ఆయా పోస్టులకు కేవలం నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వారే అర్హులని, నియామక ప్రక్రియపై పూర్తి అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మున్ననూర్‌కు ఉంటుందన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్‌నం. 99590 16495ను సంప్రదించాలని కోరారు.

మహబూబ్‌నగర్ 241/8

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో హెచ్‌సీఏ బీ-డివిజన్ రెండురోజులలీగ్ చాంపియన్‌షిప్‌లో గురువారం జిల్లా జట్టు తొలి మ్యాచ్‌లో టీమ్ స్పీడ్ జట్టుపై మంచి స్కోర్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎండీసీఏ జట్టు 80 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసింది. జట్టులో కాశీం 88 పరుగులు (152 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), అబ్దుల్ రాఫే 85 పరుగులు (182 బంతుల్లో 11ఫోర్లు) మెరుగైన ఇన్నింగ్స్ ఆడారు. శుక్రవారం రెండో రోజు మ్యాచ్ కొనసాగనుంది.

ఇందువాసి శివారులో పులి సంచారం



గట్టు: తెలంగాణ- కర్ణాటక సరిహద్దులోని ఇందువాసి ఇంజమ్మగుట్ట పరిసరాల్లో గురువారం పులి సంచరించిందని వదంతులు వ్యాపించాయి. ఈ విషయం కాస్త అటవీ శాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు గ్రామానికి చేరుకుని ఇంజమ్మ గుట్టల పరిసరాల్లో పరిశీలించారు. ఎక్కడా పులి జాడలు కనిపించలేదని, కొందరు వేటకు వెళ్లి, గుట్టల్లో అడవి పిల్లిని చూసి పులిగా భావించి ఉంటారని డిప్యూటీ రేంజర్ రాఘవేంద్ర తెలిపారు. పులి, చిరుతలు పశువులు, లేగదూడలు, కుక్కలపై దాడులు చేస్తుంటాయని, ఇప్పటి దాకా ఇలాంటి సంఘటనలు ఈ ప్రాంతంలో జరగలేదని పేర్కొన్నారు. గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని, ఏమైనా సమాచారం ఉంటే తమకు చెప్పాలని ఆయన కోరారు.

‘ఇరిగేషన్’లో సంపదవనాలు


మొక్కలు నాటేందుకు స్థలాన్ని చదును చేయిస్తున్న అధికారులు

- జిల్లాలోని 4మండలాల్లో 5 స్థలాలు గుర్తింపు
- 60 ఎకరాల్లో 50వేల మొక్కలు నాటాలని లక్ష్యం
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం
- 19న హరితోత్సవం రోజు నాటాలని నిర్ణయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న హరితోత్సవాన్ని నిర్వహించనున్నారు. సంపద వనాలపేరుతో ఇరిగేషన్ స్థలాల్లో భారీగా మొక్కలు నాటేందుకు నిర్ణయించారు. ఇందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రణాళికను తయారుచేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాల్లో నాలుగు మండలాలను ఎంపిక చేయగా ఇరిగేషన్ అధికారులు సహాయంతో స్థలాలను కూడా గుర్తించారు. కేటగిరి-ఏ లో అర ఎకరం నుంచి ఎకరం వరకు, కేటగిరి-బీ లో ఎకరం నుంచి మూడెకరాల వరకు స్థలాలను గుర్తించారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వారి చేతులమీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది.

4 మండలాల్లో 5 స్థలాల్లో...

మొక్కలు నాటేందుకు జిల్లాలో నాలుగు మండలాలను ఎంపిక చేశారు. ఇందులో భూత్పూర్, జడ్చర్ల, దేవరకద్ర, సీసీ కుంట మండలాలను గుర్తించారు.ఇందులో భూత్పూర్ మండలంలోని కరివెన ప్రాంతంలో రెండు స్థలాలు, జడ్చర్ల మండలంలో పెద్దపల్లి , దేవరకద్రలో బొల్లారం, సీసీకుంటలో ఉండ్యాల ప్రాంతాలను ఎంపిక చేశారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ యాదయ్య, ఇరిగేషన్ అధికారులు

నాటిన వెంటనే ఫెన్సింగ్..

ఇరిగేషన్ స్థలాల్లో మొత్తం 50వేల మొక్కలు నాటనున్నారు. 19న చేపట్టే ఈ కార్యక్రమం కోసం ఉపాధి కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. నిమ్మ, వేప, గుమ్మడి, వెదురు, సీతాఫలం, చింత, జామ, ఉసిరి, మామిడి ఇతర రకాల మొక్కలను నాటనున్నారు. మొక్కలు నాటిన వెంటనే వాటి సంరక్షణ కోసం స్థలాల చుట్టూ ఫెన్సింగ్ వేయనున్నారు. గేటు, ఆర్చిలను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. వీటికి హరితనిధి నుంచి డబ్బులు ఖర్చు చేయనున్నారు.


60 ఎకరాల్లో...

ఐదు స్థలాల్లో కలుపుకుని మొత్తం 50వేల మొక్కలు నాటనున్నారు. మొత్తం 60 ఎకరాలను గుర్తించారు. ఇందులో కరివెన మొదటి సైట్‌లో 14 ఎకరాల్లో 11,889 మొక్కలు, రెండో సైట్‌లో 20 ఎకరాల్లో 16,840 మొక్కలు, జడ్చర్లలోని పెద్దపల్లిలో 5ఎకరాల్లో 3200 మొక్కలు, దేవరకద్రలో బొల్లారంలో 11 ఎకరాల్లో 10,200 మొక్కలు, సీసీకుంటలోని ఉండ్యాల 10 ఎకరాల్లో 6977 మొక్కలు నాటనున్నారు.

‘హరితహారం’ ప్రారంభం అప్పుడేనా?

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితోత్సవం పేరుతో బ్లాక్ ప్లాంటేషన్‌ను చేపడుతున్నారు. అయితే తొమ్మిదో విడత హరితహారం కూడా ప్రారంభించాల్సి ఉంది. వానలు బాగా కురిస్తే హరితహారానని ప్రారంభించి జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటించాలని అధికారులు భావిస్తున్నారు. వర్షాలు లేకపోతే జూలై మొదటివారం దాకా ఆగాల్సిందే. తొమ్మిదో విడతలో అన్నిశాఖలు కలిపి 65లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇందుకు గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో ఈ మొక్కలను పెంచుతున్నారు.

60ఎకరాల్లో 50 వేల మొక్కలు..




రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బ్లాక్ ప్లాంటేషన్ చేపట్టనున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19వ తేదీన ఇరిగేషన్ స్థలాల్లో మొక్కలు నాటనున్నాం. ఇందుకోసం 60ఎకరాల స్థలాన్ని గుర్తించాం. మొత్తం 5స్థలాల్లో 50 వేల మొక్కలు నాటనున్నాం. ఇప్పటికే స్థలాలను గుర్తించం జరిగింది.

– యాదయ్య, డీఆర్‌డీఓ

జగన్నాథ రథయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో ఈనెల 25వ తేదీన నిర్వహించనున్న శ్రీజగన్నాథ రథయాత్ర పోస్టర్లను గురువారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ సంస్థ సభ్యులు మాట్లాడుతూ రెండోసారి జిల్లా కేంద్రంలో శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు పద్మావతీకాలనీ కమాన్ నుంచి జగన్నాథ రథయాత్ర ప్రారంభమై మెట్టుగడ్డ, న్యూటౌన్, ఆర్టీసీ బస్టాండ్, అశోక్‌టాకీస్ చౌరస్తా, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, రాంమందిర్ చౌరస్తా, గడియారం చౌరస్తా, పాతబస్టాండ్, తెలంగాణ చౌరస్తా, రైల్వే స్టేషన్, శెట్టి కాంప్లెక్స్ మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, ఇస్కాన్ సభ్యులు ఉదయశ్రీ, కొండప్ప, నక్కల్, మూర్తి, సురేందర్‌గౌడ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


జగన్నాథ రథయాత్ర పోస్టర్లను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కలిసికట్టుగా అభివృద్ధికి పాటుపడదాం


సమావేశంలో పాల్గొన్న పాలక మండలి

- అలంపూర్ ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్నకృష్ణయ్య

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పుణ్యక్షేత్రం పాలకమండలి సభ్యులు, దేవస్థాన సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి పాటుపడదామని ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్నకృష్ణయ్య అన్నారు. గురువారం ఈఓ పురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో చైర్మన్ చిన్నకృష్ణయ్య అధ్యక్షతన పాలక మండలి తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంపయ్య మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలను వివరించారు. ఇతర సభ్యులు మాట్లాడుతూ ఆలయానికి వీఐపీలు వచ్చిన ప్రతిసారి ట్రస్టుబోర్డు సభ్యులకు ముందస్తుగా తెలియజేయాలన్నారు. అదేవిధంగా పాలక మండలి సభ్యులకు గుర్తింపుకార్డులు జారీ చేయాలని, ధర్మకర్తల మండలి నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న జోగుళాంబ ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు. ఉదయం లక్ష పుష్పార్చన, సాయంత్రం జోగుళాంబ కల్యాణోత్సవం, భరతనాట్యం, ప్రముఖుల ప్రసంగాలు తదితర కార్యక్రమాలతోపాటు అల్పాహార విందు, ప్రముఖులను ఆహ్వానించాని తీర్మానించారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు వెంకటనారాయణరెడ్డి, చంద్రకళ, సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణ, కేశన్న, అడివప్ప, రమేష్, ధనంజయ, సురేఖ, వెంకటేశ్వర్లు, అంపయ్య, ఆనంద్‌శర్మ పాల్గొన్నారు. అనంతరం ఇటీవల మంజూరైన ఆర్చి గేట్లు, కల్యాణ మండపం వంటి పనులకు టెండర్లు ఆహ్వానించేలా ప్రతిపాదనలు తీసుకునేందుకు దేవాదాయశాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ దుర్గాప్రసాద్, ఏఈ వరుణ్ రాగా పాలకమండలి వారితో మాట్లాడి టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కోరారు.

నాటకరంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి
- ముగిసిన పద్య నాటక ప్రదర్శనలు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్

స్టేషన్ మహబూబ్‌నగర్: నాటక రంగం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్య నాటక ప్రదర్శనలు గురువారం ముగిశాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొని మాట్లాడుతూ జిల్లా కళలు, కళాకారులకు నిలయమని అన్నారు. సీఎం కేసీఆర్ కళలు, కళాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని అన్నారు. కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు టీవీ రంగయ్య మాట్లాడుతూ కళారంగం అభివృద్ధికి కేంద్రం నుంచి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. సినిమాలకు దీటుగా నాటక ప్రదర్శనలను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాయ సభ దుర్యోధన, శ్రీకృష్ణరాయబారం, రావణ బ్రహ్మ ఏకపాత్రాభినయం, శ్రీరామాంజనేయ యుద్ధ ఘట్టం, గయోపాఖ్యానం యుద్ధ ఘట్టం నాటకాలను ప్రదర్శించారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శ్రీమిత్ర కళానాట్య మండలి కార్యదర్శి వి.నారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు, లక్ష్మణ్, నర్సింలు, ప్రభాకరాచారి, జనార్దన్‌రెడ్డి, భాస్కరాచారి, దత్తు తదితరులు పాల్గొన్నారు.


చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన